ఆటలు ఆడుతున్న చిన్నారులు

ప్రజాసంఘాల ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కలిదిండి

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని మూలలంక పంచాయతీ పరిధి రామకృష్ణాపురంలో శ్రామిక సంబరాల్లో భాగంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యువతకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, స్పీడ్ వాకింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

తిరునాళ్లలా కోడి పందేలు

విచ్చలవిడిగా జూదం - జోరుగా మద్యం విక్రయాలు - చేతులు మారిన రూ.వందల కోట్లు

రెండు జిల్లాల్లో పండుగ పేరిట కోడి పందేలతోపాటు జూదాలు విచ్చలవిడిగా సాగాయి. ఈసారి అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పోటీపడి బరులు నిర్వహించడం విశేషం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద పందేలు సాగిన బరులుగా కాళ్ల మండలంలోని పెదఅమిరం, సీసలి బరులు నిలిచాయి. ఈ పందేల్లో ప్రముఖ నేతలు స్వయంగా పాల్గొనడం గమనార్హం. ఇక జూదాలతోపాటు మద్యం విక్రయాలు సైతం బరుల వద్దే పెద్దఎత్తున సాగడం అందరినీ విస్మయపర్చింది. మూడు రోజులు కానరాని పోలీసులు మంగళవారం సాయంత్రం మాత్రం ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం ప్రాంతంలో పందేలపై దాడులు నిర్వహించి హడావుడి చేశారు. జీలుగుమిల్లి మండలంలో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో జూదం శిబిరాలు మాత్రం యధావిధిగా కొనసాగడం చర్చనీయాంశమైంది.

టి.నర్సాపురం మండలంలో..

ప్రజాశక్తి - ఉంగుటూరు

సంక్రాంతి సంప్రదాయం ముసుగులో మండలంలో మూడు రోజులపాటు కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. ఫ్లడ్‌లైట్లు, సినీసెట్టింగుల తరహాలో డెకరేషన్‌తో కూడిన పందిళ్లు, ప్రేక్షకులు వీక్షించేందుకు కుర్చీలతో సహా అన్నీ ఏర్పాట్లతో బరులు నిర్వహించడం గమనార్హం. నారాయణపురంలో పందేల బరుల వద్ద భారీ స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయడం గమనార్హం. లక్కీ డ్రా రూ.వెయ్యి టిక్కెట్ తీసుకున్న వారికి డ్రాలో ఇచ్చేలా బుల్లెట్ వాహనాన్ని ఉంచారు. బాదంపూడిలో ఫ్లడ్‌లైట్స్ నడుమ పెద్దసంఖ్యలో పందేలు సాగాయి. నారాయణపురం, కొత్త ఉంగుటూరు, చినవెల్లమిల్లి, రాచూరు, గొల్లగూడెం, కైకరంలో కోడి పందేలతోపాటు పేకాట విచ్చలవిడిగా జరిగాయి. అధికారపార్టీ ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందేలు నిర్వహించడం గమనార్హం. అలాగే టిడిపి నేతల ఆధ్వర్యాన పందేలు సాగాయి. ఈ మూడు రోజుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సొంతూరుకు వచ్చిన వారు పందేలను తిలకించేందుకు రావడంతో రద్దీ మరింత పెరిగింది. గడిచిన ఏడాది కంటే ఈసారి శుక్రవారం, శనివారం సెలవు రోజులు కావడంతో హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి తెలుగు వారు సొంతూళ్లకు రావడంతో రద్దీ పెరిగిందని బస్సు టికెట్ ధరలు అధికంగానే ఉన్నట్లు ప్రయివేటు ట్రావెల్స్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు.

జీలుగుమిల్లి: మండలంలో కోడిపందేలు విచ్చలవిడిగా నిర్వహించారు. మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం, అంకన్నగూడెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేలకు జనాలు భారీగా తరలొచ్చారు. తెలంగాణలో పందేలు లేకపోవడంతో అక్కడి పందెంరాయుళ్లు కూడా సరిహద్దు గ్రామాల్లోకి రావడంతో పందేలు పెద్దఎత్తున సాగాయి.

ముసునూరు: కోడిపందేలు, పేకాట, జూదం, గుండాట మండలంలో విచ్చలవిడిగా రాజకీయ నాయకుల కనుసన్నల్లో సాగాయి. మండలంలోని 16 గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ పందేల్లో పాల్గొన్నారు. మద్యం, బిర్యానీ అమ్మకాలు సాగించారు.

టి.నరసాపురం: మండలంలోని టి.నరసాపురం, బందంచర్ల, తిరుమలదేవిపేట, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం గ్రామాల్లో పందేల జోరు సాగింది. మండలంలో సుమారు కోటి రూపాయల వరకు చేతులు మారినట్లు పలువురు చెబుతున్నారు.

ముదినేపల్లి: మండలంలోని పేరూరు, ఈడేపల్లి, జానకిగూడెం, వడాలి, దేవపూడి, ముదినేపల్లి గ్రామాల్లో కోడి పందేలు జాతరను తలపించేలా సాగాయి. ఫుడ్ కోర్టులు, మద్యం, సిగరెట్లు. తినుబండారాల స్టాల్స్ విరివిగా వెలిశాయి. మరోవైపు కోడిపందేలతో పాటు పేకాట, గుండాట వంటి ఆటలు కూడా జోరుగా సాగాయి. పందేలను చూడడానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ పేరుతో కూడా పెద్దఎత్తున డబ్బు వసూలు చేశారు.

కాళ్ల: సంక్రాంతి పండుగ మూడు రోజులు మండలంలో పెదఅమిరం, సీసలి గ్రామాల్లో భారీస్థాయిలో నిర్వహించిన కోడి పందేలు తిరునాళ్లలా నిర్వహించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో టెంట్లో, పేకాట శిబిరాలు, గుండాట, క్యాసినో బోర్డులు వేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు గ్రామాల్లో ఒకటి నుంచి రెండు బరులు ఏర్పాటు చేశారు. వినోదం పేరుతో గ్రామాల్లో అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న జూదాల్లో సుమారు మూడు రోజుల్లో రూ.వంద కోట్ల వరకూ చేతులు మారాయి. ఒక్కో కోడిపందెం లక్ష నుంచి రూ.19 లక్షల వరకు సాగడం గమనార్హం.

ఆచంట: కత్తి కట్టిన కోళ్ల పందెంలో సై అంటే సై అంటూ పోటీపడ్డాయి. ఈ మూడు రోజుల్లో నియోజకవర్గంలోని ఆచంట, పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో భారీస్థాయిలో కోడిపందేలు సాగాయి. ఈ మూడు రోజులు పందేలు, గుండాట, కోతాట జోరుగా సాగిపోయాయి. అక్కడా ఇక్కడా అనే తేడా లేకుండా ప్రతి గ్రామంలో చిన్నపాటి బరుల్లో పందేలు సాగడం గమనార్హం.

నరసాపురం: సంక్రాంతి సందర్భంగా నరసాపురంలో పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించారు. పట్టణ శివార్లలోని లేఅవుట్లో పెద్దఎత్తున టెంట్లు వేసి పగటి పూటతోపాటు రాత్రి వేళల్లో కూడా ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు వేశారు. బరుల వద్ద జనాలను అదుపు చేసేందుకు బౌన్సర్లను సైతం ఏర్పాటు చేయడం విశేషం. కోడిపందేల పక్కనే గుండాట, కోతాట బోర్డులను ఏర్పాటు చేశారు. కొన్ని బరుల వద్ద పందెంరాయుళ్ల వీక్షకులకు ఇబ్బంది లేకుండా భారీ ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. బరుల వద్దే యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగాయి. బరులు వద్ద రాత్రి సమయాల్లో జనాన్ని ఆకర్షించేందుకు ఆర్కెస్ట్రాలను సైతం ఏర్పాటు చేశారు.

మొగల్తూరు: మండలంలో కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. మండల కేంద్రం మొగల్తూరులోనే సుమారు ఐదుచోట్ల పందేల బరులు ఏర్పాటు చేయడం విశేషం. వీటితోపాటు మండలంలో పేరుపాలెం, కెపి.పాలెం, కాళీపట్నం, ముత్యాలపల్లి, వారతిప్ప, రామన్నపాలెం తదితర గ్రామాలలో కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద గుండాట బోర్డులను ఏర్పాటు చేశారు. జనం ప్రత్యేక వాహనాల్లో ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చారు.

పందేలపై పోలీసుల దాడులు

జీలుగుమిల్లి: మండలవ్యాప్తంగా పలుచోట్ల నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడులు చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కామయ్యపాలెం, రాచన్నగూడెం, జీలుగుమిల్లి, తాటియాకులగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై హెడ్ కానిస్టేబుళు రాధాకృష్ణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,170 నగదు, నాలుగు కోళ్లు, నాలుగు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పందేలు, జూదం అభివృద్ధిలో భాగమా..!

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు: అధికారపార్టీ ప్రజాప్రతినిధులే కోడి పందేలు, జూదం, మద్యం వంటి చెడు అలవాట్లను ప్రోత్సహిస్తూ, నిర్వహిస్తూ యువతను చెడు మార్గాల వైపు మళ్లించడం రాష్ట్ర అభివృద్ధిలో భాగమా అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ములగలంపాడులో సాక్షాత్తూ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, సర్పంచులు పందేల్లో పాల్గొనడం శోచనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చామని చెప్పడం అంటే యువతను చెడు మార్గం పట్టించే కోడి పందేలు, జూదం, మద్యానికి బానిసత్వం చేయడమేనా అని ప్రశ్నించారు. పండుగల సందర్భంగా యువతను మంచి మార్గంలో నడిపేలా క్రీడలను ప్రోత్సహిస్తూ ఆటల పోటీలు నిర్వహించడం, చదువుపై విజ్ఞానంపై శ్రద్ధ పెంచే విధంగా వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు వంటి వాటిని నిర్వహించడం, అందులో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలి గాని చెడు అలవాట్లకు బానిసలను చేయరాదని హితవు పలికారు. కోడి పందేలను హైకోర్టు నిషేధించిందని, దాన్ని ప్రజాప్రతినిధులే ధిక్కరిస్తే ఎలాగని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం నిఘా పెంచి అసాంఘిక కార్యక్రమాల నిర్వహణను కట్టడి చేయాలని కోరారు.

షర్మిల రాక ప్రభావం చూపేనా..!

రాజకీయ నేతల్లో చర్చ

పొత్తులపైనే ప్రభావమంటున్న విశ్లేషకులు

ప్రజాశక్తి - డెస్క్

అంతా అనుకున్నట్లుగానే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ముందు నుంచి దీనిపై ప్రచారం ఉన్నా కాంగ్రెస్ అధిష్టానం అధికారిక ప్రకటనతో అటు రాజకీయ నేతలు, ఇటు జనంలో ఒకింత చర్చ నెలకొంది. అయితే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రభావం కోల్పోయిన కాంగ్రెస్‌కు షర్మిల నియామకం ఊపిరి పోస్తుందా, లేదా అని ఎడతెగని చర్చ సాగుతోంది.

రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులే కరువయ్యారంటే రెండు జిల్లాల్లో ఆ పార్టీ పరిస్థితి ఏమిటో అర్థమవుతోంది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో అంటే 2004, 2009 ఎన్నికల్లో జిల్లాలో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ చేజిక్కించుకుంది. రాష్ట్ర విభజన అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నికల ముందే కొంతమంది వైసిపి గూటికి చేరగా కొంతమంది నేతలు స్తబ్దతగా ఉండిపోయారు. నాటి నుంచి నేటి వరకూ రెండు జిల్లాల్లో అక్కడక్కడా సంప్రదాయవాదులుగా పేరొందిన కొందరు కాంగ్రెస్ నేతల కదలికలే కన్పిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి, పాలకొల్లు ప్రాంతాలతోపాటు మరికొన్ని మండలాల్లో కొందరు వ్యక్తులుగానే కాంగ్రెస్ నేతలు ఉన్నారు. ఉండి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాత్రం ఏదోక కార్యక్రమం నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో కర్నాటక, ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడున్న నేతల్లో కొంత ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో షర్మిల పిసిసి అధ్యక్షురాలిగా నియమితులు కావడంపై జిల్లాలో ప్రభావంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైసిపి అధినేత జగన్‌ను షర్మిల ఇరుకున పెడతారా.. లేక తామే ఇరుక్కుపోతారా అనేది పొత్తుల వ్యవహారం బట్టి ఉంటుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యాన ఇండియా వేదిక నడుస్తోంది. ఈ క్రమంలో టిడిపి, కాంగ్రెస్ పొత్తు నెరవేరాలంటే కచ్చితంగా బిజెపితో అంటకాగుతున్న జనసేనను టిడిపి వదులుకోవాల్సిందే. అయితే అదిజరిగే పరిస్థితులేవీ ప్రస్తుతం కానరావడం లేదు. అదే సందర్భంలో వైసిపితో కాంగ్రెస్ జత కట్టే పరిస్థితీ లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అటు టిడిపి, ఇటు వైసిపికి దూరంగా ఒంటరిపోరు తప్పని పరిస్థితి కన్పిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో ఏలూరు, ఉండి నియోజకవర్గాల్లో మినహా ఎక్కడా బరిలోకి దిగే అభ్యర్థులు సైతం కానరావడం లేదు. అయితే గతంలో కాంగ్రెస్ పదవులు చేపట్టి ప్రస్తుతం స్తబ్దతగా ఉన్న మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు వంటి వారు ఏమైనా రంగంలోకి దిగితే ఎంతోకొంత ఉనికి చాటుకునే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో వైసిపిలో టిక్కెట్లు దక్కని వారు టిడిపి, జనసేన వైపు చూస్తున్నా అక్కడ అవకాశాలు కానరాక తిరుగుబావుటా ఎగరవేయడానికి కొంత సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో షర్మిల రాకతో వారంతా తాము వైఎస్ అనుచరులమని చెప్పుకుంటూ కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం ఉందనే వాదన విన్పిస్తోంది. ఏదైమైనా జిల్లాలో జనాల్లో ప్రభావం చూపే కాంగ్రెస్ నేతలెవరా అనే చర్చ పలుచోట్ల సాగుతోంది. ఏదేమైనా రెండు జిల్లాల్లో కాంగ్రెస్‌కు వచ్చే ఓట్ల శాతం ఎలాగున్నా.. అసలు పోటీలో ఉంటుందా, గతంలానే చతికిలపడి ఉంటుందా అనేది నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే నాటికిగాని తేలే అవకాశం లేదని పరిశీలకులు చెబుతున్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

స్థానిక డిఎఆర్ కళాశాల ఆవరణలో రెండు తెలుగు రాష్ట్రాలస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు మేక మెహర్‌రామ్ అప్పారావు, టిడిపి నాయకులు పర్వతనేని గంగాధర్‌రావు, నూతక్కి వేణు పోటీలను ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. పురుషులు, మహిళల జట్లు కలిపి మొత్తం 37 పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కునూరులో గంగిరెద్దుకు వినతినిస్తూ

జీలుగుమిల్లిలో ఆటలు ఆడుతూ

ముసునూరులో..



చాట్రాయిలో..

జగనన్న నీకేమో పండుగ వేడుకలు.. మాకేమో పస్తులా..!

36వ రోజు అంగన్వాడీల సమ్మె-నేటి నుంచి రాష్ట్రకేంద్రంలో నిరవధిక నిరాహార దీక్షలు-జిల్లాలో పలుచోట్ల గంగిరెద్దుకు వినతి ఇచ్చి, సాష్టాంగ నమస్కారాలు చేస్తూ, ముగ్గులు వేస్తూ, పిండివంటలు వండుతూ, ఆటలు ఆడుతూ నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె 36వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మంగళవారం కనుమ పండుగ రోజు ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు జగనన్నకు సాష్టాంగ నమస్కారాలు చేసి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు, యూనియన్ నాయకులు స్వప్న మాట్లాడుతూ అంగన్వాడీలను పండగ రోజు కూడా రోడ్డుమీద పడేసిన పాపం జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. అంగన్వాడీలకు విధుల్లోకి చేరాలని నోటీసులు ఇచ్చి, లేకుంటే వారి ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించడం చాలా దుర్మార్గమన్నారు. వారు అడిగిన న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కించటం సిగ్గుచేటు అని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర కేంద్రంలో నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.విజయలక్ష్మి, అంగన్వాడీ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్షులు టి.రజిని, రామలక్ష్మి, చిలకమ్మ, శారద, మేరీ, గాయత్రి దేవి, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

ఏలూరులో సాష్టాంగ నమస్కారాలు చేస్తూ

కుక్కునూరు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే జగనన్న ప్రభుత్వంకి బారి మూల్యం ఉంటుందని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ విమర్శించారు. అంగన్వాడీల సమ్మె మంగళవారం కనుమ రోజు 36వ రోజుకు చేరుకున్న సందర్భంగా గంగిరెద్దుకు వినతినిచ్చి సమ్మె శిబిరంలోనే పిండి వంటలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ జగనన్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించమంటే రాష్ట్రం అప్పుల్లో ఉందని చెప్పి, రెండు గంటల భోగి పండుగ జరుపుకోవడాని రూ.2 కోట్ల ప్రజా ధనం ఎలా వృధా చేశారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన మానేసి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మె విరమింపజేసేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సుజాత, అలివేలు, లక్ష్మీకాంత, ప్రభామణి, వందన, సమ్మక్క, కావ్య, పార్వతి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలకేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీలు ముగ్గులు వేస్తూ నిరసన తెలిపారు. ఈ నిరసనలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, సునిత రాయ్, చిట్టి, శాంతి కుమారి, షేక్ నుర్జాహన్, మడకం గంగాదేవి, మరియమ్మ, పి.నాగరత్నం పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 36వ రోజుకు చేరింది. తమ డిమాండ్లు పరిష్కరించాలని శిబిరం వద్ద సంక్రాంతి ముగ్గులు వేసి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ శిబిరానికి చేరి సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి షేక్ అబిదా బేగం, నాయకులు విజయలక్ష్మి, సిహెచ్.పద్మ, ఏసు కుమారి, సాయమ్మ, లలిత, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

చింతలపూడి: పండుగను సైతం లెక్కచేయకుండా అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారానికై 36వ రోజు కూడా సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నాయకులు టి.మాణిక్యం, కవిత, ఎం.అరుణ, హేమలత మాట్లాడుతూ బుధవారం నుంచి రాష్ట్రకేంద్రంలో అంగన్వాడీలు తమ డిమాండ్ల సాధనకై నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో దీక్షలు చేస్తున్న వారికి సంఘీభావంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామన్నారు. తమ ఉద్యమానికి మద్దతుగా ప్రజలచే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి పత్రాలను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, శ్యామల సీతామహాలక్ష్మి, రజియ, సుజాత, రమాదేవి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ మంగళవారానికి 36వ రోజుకి చేరుకుంది. కనుమ పండుగ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు కుర్చీలాటలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెల్లం రామకృష్ణ, దుర్గారావు, సిఐటియు నాయకులు నాగమణి, కొండలరావు, నిర్మల, అప్పారావు, కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, సరళ పాల్గొన్నారు.

చాట్రాయి: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి తమకు న్యాయం చేయాలని చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. చాట్రాయి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నినాదాలు చేస్తూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళ్యాణి, జమలమ్మ, శివకుమారి నాయకత్వం వహించారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తలు సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మెలో భాగంగా పట్టు వదలకుండా వారు పోరాడుతూనే ఉన్నారు. సమ్మె 36వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా లెక్క చేయకుండా పోరాడుతూనే ఉన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ముసునూరు: జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మా సమస్యలను పరిష్కరించకపోగా, సమస్యగా మారారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయం వద్ద అంగన్వాడీల నిరసన కార్యక్రమం 36వ రోజు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పల్లిపాము రాజకుమారి, కలపాల విద్యావతి, మేరీ సులోచన, లక్ష్మి, విజయలక్ష్మి, శ్యామల, భార్గవి, దుర్గ, శిరీష పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన దీక్ష మంగళవారం నాటికి 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ హనుమాన్లు, ఆదిలక్ష్మి, రమాదేవి, పద్మజ్యోతి, పలు మండలాలకు చెందిన అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు.

కలిదిండిలో

చింతలపూడిలో

నూజివీడులో

టి.నరసాపురంలో

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైసిపి మండల కన్వీనర్

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలు తరలి రావాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఈనెల 19వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న సామాజిక న్యాయ మహా శిల్పం(అంబేద్కర్ విగ్రహం) ఆవిష్కరణ కార్యక్రమానికి భీమడోలు మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షులు పి.సునీత మార్నింగ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కార్యక్రమ ప్రచారం కోసం సిద్ధం చేసిన కరపత్రాలను మంగళవారం వైసిపి మండల కన్వీనర్, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్య శ్రీనివాస్ భీమడోలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మార్నింగ్ పాల్గొన్నారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి : ఆదిశేషు

ఏలూరు : చేతివృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ క్యాంపు కార్యాలయంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నూతన సంవత్సర జిల్లా క్యాలెండర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ ఛైర్పర్సన్ గంట పద్మశ్రీ ప్రసాద్, చేతివృత్తిదారుల జిల్లా నాయకులు, బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకుల మధ్య ఉత్సాహభరితమైన వాతావరణంలో ఆవిష్కరించారు. అనంతరం ఆదిశేషు మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావం వలన చేతివృత్తులు కునారిల్లుతున్నాయని, వృత్తిదారులు ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారని అటువంటి వారిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. చేతివృత్తిదారుల క్యాలెండర్ ఆవిష్కరించినందుకు పిచ్చుక ఆదిశేషు, ఏలూరు బిసి సంఘం నాయకులు లక్ష్మోజు గోపి, ఏపి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌విఆర్ విరల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.యేసు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ బిఎన్‌వి.లక్ష్మీనారాయణ, ఇతర బిసి సంఘాల నాయకులు బాలిన రాంబాబు, పువ్వుల ఆంజనేయులు, మాజీ బిసి సంఘం నాయకులు టెంటు సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు.

హామీలు ఇచ్చారు.. అభివృద్ధి మరిచారు

చింతలపూడిలో అభివృద్ధి శూన్యం
అధ్వానంగా రోడ్లు-పట్టించుకోని అధికారులు
ఇబ్బందుల్లో స్థానికులు

చింతలపూడి నగరపంచాయతీ..

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి శూన్యంగానే కనిపిస్తుంది. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఒకటి, రెండు తప్ప మిగిలినవి హామీలుగానే మిగిలిపోయాయి. గతంలో ఎప్పుడూ ఇంత అస్తవ్యస్తంగా చూడని పరిస్థితి నెలకొంది. చింతలపూడి నగరపంచాయతీలో రోడ్లు గ్రామాల కంటే అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పూడ్చటానికి మట్టి వాడటంతో వాహనాలు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు దుమ్ముతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. నగరపంచాయతీ పన్నులు వసూలు చేస్తున్నా కనీస అభివృద్ధి వైపు దృష్టి సారించని పరిస్థితి. చింతలపూడి సెంట్రల్ లైటింగ్ వచ్చిన ఏ ఒక్కరూ దానివైపు కన్నెత్తని పరిస్థితి నెలకొంది. రాత్రిపూట నగరపంచాయతీలో దుకాణాల వద్ద లైట్లు ఆపేస్తే, గ్రామీణ ప్రాంతం కంటే దారుణంగా ఉంటుందని నగరపంచాయతీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి

నిరుపయోగంగా చింతలపూడి పాత బస్టాండ్: చింతలపూడి పాత బస్టాండ్ వద్ద నిర్మించిన బస్టాండ్ గురించి అధికారులకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు సైతం ఈ సమస్యపై దృష్టి సారించకపోవటంతో సుమారు రూ.35 లక్షలతో నిర్మించబడిన బస్టాండ్ నిరుపయోగంగా మిగిలిపోతుంది. పాతబస్టాండ్ ఎండకు ఎండిపోతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ నిలువ నీడలేకుండా, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా కనీసం అధికారులు స్పందించడంలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

నగరపంచాయతీలో కనిపించని పబ్లిక్ మరుగుదొడ్లు: ఏ నగరపంచాయతీకి వెళ్లినా ఎక్కడైనా పబ్లిక్ మరుగుదొడ్లు దర్శనమిస్తున్నాయి. కాని చింతలపూడి నగరపంచాయతీలో ఇప్పటి వరకు ఒకటి కూడా మరుగుదొడ్లు లేకపోవటం గమనార్హం. మహిళలు మరుగుదొడ్లు లేక వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం కార్యాలయానికి వస్తే సాయంత్రం వరకు ఉంటున్న పరిస్థితి. పురుషులకి ఇబ్బంది లేకపోయినా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని మరుగుదొడ్డు నిర్మించాలని కోరుకుంటున్నారు.

అధ్వానంగా రోడ్లు : మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. చేప్పుకోదగ్గ రోడ్డు లేకపోవటం గమనార్హం. ఫలానా రోడ్డు బాగుంది అని చేప్పుకోలేని పరిస్థితి. ఏ రోడ్డు చూసినా, ఎటు చూసినా పెద్ద పెద్ద గుంతలతో మండలం దర్శనం ఇస్తుంది.

నామవరం-సీతానగరం రోడ్డు వేస్తామని 2019 ఎన్నికల ముందు మొదటి హామీ ఇచ్చారు. నేటికి ఆరోడ్డు వేయని పరిస్థితి. గత నాలుగు సంవత్సరాలుగా ఆరోడ్డు టెండర్ ప్రక్రియ పూర్తి అవుతుంది. అదిగో పులి, ఇదిగో పులి అనే సామెతగా తయారైంది. నేటికి ఈ రోడ్డు పూర్తి అవ్వని పరిస్థితి. అదేవిధంగా బాలవారిగూడెం, కొమ్ముగూడెం, నేటికి అదే పరిస్థితి. ఇప్పుడు ఎన్నికల సమయంలో ఏవిధంగా ఆ గ్రామ ప్రజలు స్పందిస్తారో.. ఎన్నికల సమయంలో ఓటు అడుగటానికి ప్రజాప్రతినిధులు ఏ మొహం పెట్టుకుని వస్తారో అని ప్రజలు మండిపడుతున్నారు.

నేరాలు - ఘోరాలు

చిన్నపాటి వివాదంతో స్నేహితుని హత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

స్నేహితుల మధ్య చెలరేగిన చిన్నపాటి వివాదం హత్యకు దారి తీసిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 48 గంటల్లో నిందితుడిని అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. ఏలూరు నగరంలోని డిఎస్పి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏలూరు డిఎస్పి ఇ.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని హనుమాన్ నగర్‌కి చెందిన లక్కోజు సురేష్(43), అమీనాపేటకు చెందిన కైతే పల్లి వంశీ కుమార్ స్నేహితులు. ఈనెల 14న పండుగను పురస్కరించుకుని అతిథి సత్కారం నేపథ్యంలో అర్ధరాత్రి స్నేహితులు ఇద్దరు కలిసి అమీనాపేటలోని వంశీ కుమార్ ఇంట్లో భోజనానికి ఆహ్వానించాడు. దీంతో ఇద్దరు కలిసి అక్కడ భోజనం ముగించారు. అక్కడే వారిద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వేరే వేరే విషయాల పట్ల మాట మాట పెరిగి ఒక్కసారిగా వివాదం చోటుచేసుకుంది. తన తల్లిని అకారణంగా నిందించాడని వంశీ అతనిపై కోపం తెచ్చుకున్నాడు. ఈ ఘర్షణ హత్యకు దారి తీసింది. ఈ ఘర్షణలో వంశీ కుమార్‌ను, అతని తల్లిని సురేష్ దుర్భాషలాడాడు. దీంతో ఆగ్రహించిన వంశీ కుమార్ కర్రతో సురేష్‌ను తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం సురేష్‌ని హత్య చేసిన వంశీ కుమార్‌ను త్రి టౌన్ పోలీసులు మంగళవారం ఏలూరులో అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వంశీ కుమార్‌కు రిమాండ్ విధించారని డిఎస్పి శ్రీనివాసులు తెలిపారు. ముద్దాయిని అరెస్ట్ చేయడంలో సక్రమంగా విధులు నిర్వర్తించినందుకు హెచ్‌సిలు ఓం ప్రకాష్, యేసు, కానిస్టేబుల్స్ ఇస్సాకు, హేమ సుందరు, రాజేంద్ర ప్రసాద్‌లను డిఎస్పి శ్రీనివాసులు అభినందించారు. విలేకరుల సమావేశంలో త్రీటౌన్ సిఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐలు ఎస్‌కె మదీనా భాషా, జి.అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ మృతి

ప్రజాశక్తి - ముసునూరు

కోటేశ్వరమ్మ (ఫైల్ ఫోటో)

మహిళ ఉరేసుకుని మృతి చెందిన సంఘటన ముసునూరు మండలం చింతలవల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం చింతలవల్లి గ్రామానికి చెందిన పల్లి పాము కిశోర్ భార్య కోటేశ్వరమ్మ(30) సోమవారం తెల్లవారుజామున ఉదయం 6.30 నిమిషాలకు తమ ఇంట్లో చీరతో ఉరేసుకోగా, కుటుంబ సభ్యులు ఆమెను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెకు ఒక బాబు, పాప కలరు. మృతురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జీలుగుమిల్లి : మండలంలోని కామయ్యపాలెం శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్ర శేఖర్ తెలిపారు. కామయ్యపాలెం శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేయగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,150 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బంగారు వస్తువుల చోరీ

ముసునూరు : ముసునూరు మండలం గోపవరం గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన పుట్ట నాగరాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తెల్లవారుజామున ఉదయం 3 గంటలకు ద్వారకాతిరుమల వెళ్లారు. తిరిగి వచ్చాక తమ ఇంటిలోని బీరువాలో రెండు కాసులునర చంప సవరాలు, చెవి దుద్దులు, బంగారు వస్తువులు కనపడలేదు. దీంతో ఎవరో దొంగలించారని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేల్లో దొంగల హల్‌చల్

ముదినేపల్లి : మండలంలో జరుగుతున్న కోడి పందేల్లో దొంగలు హల్చల్ చేశారు. మండలంలోని ఈడేపల్లి బరిలో అల్లూరుకి చెందిన గంగుల వెంకటనారాయణ సోమవారం పందేలు వేసేందుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు చూడగా బైక్ మాయమైంది. అలాగే జానకి గూడెం బరిలో మంగళవారం జేబు దొంగలు కలిదిండి మండలం కోరుకొల్లుకు చెందిన వేపకాయల వెంకటేశ్వరరావు జేబులో రూ.10 వేలు, అలాగే బొమ్మినంపాడుకు చెందిన ఆకునూరి ఓంకార్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించారు. రెండో మారు వెంకటేశ్వరరావు జేబులో నుంచి మళ్లీ డబ్బు తీసే ప్రయత్నంలో వెంకటేశ్వరరావు అప్రమత్తమై జేబుదొంగలను పట్టుకున్నారు. దీంతో జనం వారికి దేహశుద్ధి చేసి ముదినేపల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇద్దరి జేబుదొంగలను ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పలువురిపై కేసు నమోదు

టి.నరసాపురం : మండలంలోని వీరభద్రవరంలో కోడి పందేలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి వారి వద్ద రూ.1,150 నగదు, కోడిపుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేంద్ర కుమార్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని తిరుమలదేవిపేటలో గుండాట నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.750, వెలగపాడులో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి రెండు లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కార్మికుల హక్కుల కోసం పోరాడిన నేత సూర్యప్రకాశరావు

అశ్రునయనాల నడుమ ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం ఏలూరు పట్టణ మాజీ కార్యదర్శి, కార్మిక నేత పల్నాటి సూర్య ప్రకాశరావు(87) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయన మృతికి సిపిఎం, సిఐటియు, వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు సంతాపం తెలియజేశాయి. సోమవారం సాయంత్రం అంతిమయాత్ర, అంత్యక్రియలు నిర్వహించారు. పడమర వీధిలో సూర్య ప్రకాశరావు నివాసం నుంచి వంగయ్ గూడెం, వడ్డెర గూడెం, దక్షిణ వీధి మీదుగా వెంకన్న చెరువు స్మశాన వాటిక వరకు అంతిమయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, సిపిఎం, సిఐటియు జెండాలతో పాల్గొన్నారు. అంతిమయాత్ర అనంతరం స్మశాన వాటిక వద్ద సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన సంతాప సభ జరిగింది. ఈ సంతాప సభలో సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య, గుడిపాటి నరసింహారావు, పశ్చిమగోదావరి సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, పల్నాటి కుమార్‌లు మాట్లాడుతూ పల్నాటి సూర్య ప్రకాష రావు స్వస్థలం నూజివీడు దగ్గర దేవరగుంట అని, బతుకుతెరువు కోసం ఏలూరు వచ్చి ఒక సాధారణ రైస్ మిల్ కార్మికుడిగా జీవితం ప్రారంభించారన్నారు. తాను కార్మికుడిగా పనిచేస్తూనే తోటి కార్మికుల హక్కుల కోసం సిఐటియు సంఘాన్ని స్థాపించి పోరాడారన్నారు. సిఐటియు ఏలూరు తాలూకా రైస్‌మిల్ యూనియన్ వ్యవస్థాపకులుగా, ఏలూరు డివిజన్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శిగా, సిఐటియు ఏలూరు పట్టణ అధ్యక్షులు, కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేశారు. కామ్రేడ్ నండూరి ప్రసాదరావు రాష్ట్రప్రధాన కార్యదర్శిగా ఉన్నకాలంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. సిపిఎం ఏలూరు పట్టణ కార్యదర్శిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారు. తాను చూస్తున్న యూనియన్, కమిటీలలో 'నీతీ, నిజాయితీలతో నిక్కచ్చిగా ఉండేవారు. పార్టీ పట్ల అంచలంచెల విశ్వాసం, నాయకత్వం పట్ల గౌరవంతో తుది శ్వాసవరకూ ఉన్నారు. తన ఉద్యమ కాలమంతా నిరాడంబరంగా జీవించారు. కష్టపడి తన కుటుంబాన్ని, పిల్లలను తీర్చిదిద్దారు. ది ఏలూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పనిచేశారన్నారు. సూర్య ప్రకాష రావుకి భార్య, ఇద్దరు కుమారులు, 9 మంది మనవలు, ముని మనవళ్లుఉన్నారు.

భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నివాళులర్పించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాధ రావు, వి.సాయిబాబు, చేతివృత్తిదారుల జిల్లా కార్యదర్శి పి.ఆదిశేషు, సిపిఎం సీనియర్ నాయకులు కంది విశ్వనాథం, గొట్టాపు మురళీ, గొట్టపు రవి కిషోర్, పడమర వీధి సిపిఎం శాఖ కార్యదర్శి వైఎస్.కనకారావు, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు బద్ద వెంకటరావు, కాకర్ల అప్పారావు, సిపిఐ జిల్లా నాయకులు కడుపు కన్నయ్య ఉన్నారు.

పలువురు నేతల సంతాపం : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం సీనియర్ నాయకులు ఆర్.సత్యనారాయణ రాజు, జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, పశ్చిమగోదావరి జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు కేత సూర్యరావు, చింతకాయల బాబూరావు, జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా నాయకులు కేత గోపాలం, జెఎన్‌వి గోపాలం, కౌరు పెద్దిరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సూర్య ప్రకాష్ రావు మృతికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రతి పేదవాడికి స్థలాన్ని కేటాయించి ఇళ్లు కట్టడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డిని రెండోసారి సిఎంగా ఎన్నుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి కొన్ని చోట్ల లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారన్నారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు జరుగుతుందన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేశారన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగమే వైఎస్ఆర్-జగనన్న కాలనీలు అని తెలిపారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో ఇళ్లకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించి పనులు చేపట్టారన్నారు. వీటిని అందుకున్న లబ్ధిదారులు చాలామంది ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నా రు. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా లేఅవుట్‌లలో విద్యుత్ సరఫరా, బోర్లు వేయడం, మోటార్లు బిగించడం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తాగునీటి సరఫరా, అంతర్గత రోడ్లు వేయడం, విద్యుత్ సరఫరా వంటి సామాజిక మౌలిక సదుపాయాల పనులు కూడా పూర్తి చేసే పనులు జరుగుతుందన్నారు. కైకలూరు ఎంఎల్‌ఎ డి.నాగేశ్వరరావు మరోసారి ఎంఎల్‌ఏగా గెలిచి మంత్రిగా చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. పెదపాలపర్రు గ్రామంలో ఎన్నడూ జరగని అభివృద్ధి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలోనే జరిగిందన్నారు. గ్రామంలోని ఎస్‌సి ఏరియాలో గడపగడపకూ రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులు, రూ.20 లక్షలు ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సిమెంట్ డ్రైనేజీ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎకరం స్థలాన్ని తీసుకోవడం జరిగిందని, ఈ విషయంలో ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపించారన్నారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మండల పరిషత్ నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి సహకరించారన్నారని సంధ్య తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గంట సంధ్య

వణుదుర్రులో మీడియాపై దౌర్జన్యం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజు రోజుకు శృతిమించుతున్నాయి. అధికారం మాదికదా అని చిన్న సమస్యను కూడా జీర్ణించుకోలేక పత్రికా విలేకరులపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్న వైనం ముదినేపల్లి మండలంలో చోటుచేసుకుంది. అధికార పార్టీ నాయకుడు బ్రోకర్‌గా ఉంటూ అధికారులకు ముడుపులు ఇచ్చి అనుమతులు తీసుకోకుండా ఆక్వా చెరువు తవ్వకాలు యథేచ్ఛగా చేపడుతున్నాడు. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామంలో ఆక్వా కొత్త చెరువు తవ్వకం జరుగుతున్న ప్రదేశానికి వచ్చి ఫోటోలు తీస్తున్న విలేకరులపై దుర్భష లాడాడు. వణుదుర్రు గ్రామానికి చెందిన బోయిన అప్పన్న అనే వ్యక్తి, మరి కొంతమంది యువకులు నలుగురు పత్రిక విలేకరులపై దౌర్జన్యానికి దిగారు. ఆతరువాత పత్రికా విలేకరులు ఆక్వా చెరువుల ఫోటోలు తీస్తుండగా విలేఖరుల సెల్ ఫోన్‌లు, మోటార్ సైకిల్ తాళాలు లాక్కుని నానా రగడ చేశారు. ఒక ఎకరానికి అనుమతి తీసుకొని అదనంగా ఆక్వాచెరువు తవ్వకాలు చేపడుతున్నాడు. విలేకరులపై దౌర్జన్యం చేసి దుర్భషలాడిన వ్యక్తిపై విలేకరులు ఎస్ఐ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయమై గ్రామ విఆర్ఓ నరసింహారావు వివరణ కోరగా చెరువు తవ్వకానికి అనుమతులు ఉన్నాయని, అనుమతి పత్రాలు వేరే ఫోన్‌లో ఉన్నాయని వాటిని రేపు మీ వాట్సాప్‌కు పెడతాను అని వివరణ ఇచ్చారు.

ద్వారకా తిరుమలలో కనుమ ఉత్సవం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల చిన్నవెంకన్న పార్వేటి మహోత్సవం (కనుమ ఉత్సవం) నడుమ మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం కనుమ రోజు స్వామివారు ఊరేగింపుగా దొరసానిపాడు గ్రామం వెళ్లుట ఆనవాయితీ. శ్రీవారు ఉభయ దేవేరులతో రాజాధిరాజ వాహనంపై కొలువుదీరి ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా గజ, అశ్వ సేవల నడుమ భక్తులకు దర్శనమిస్తూ శేషాచలం వెనుకభాగాన ఉన్న దొరసానిపాడు గ్రామానికి తరలి వెళ్లారు. మహిళలు స్వామివారి వాహనం వచ్చే దారి పొడవునా రంగవల్లులతో, మామిడి తోరణాలు కట్టి తీర్చిదిద్దారు. ప్రతిఏటా శ్రీవారు కనుమ నాడు మాత్రమే క్షేత్రాన్ని విడిచి పొరుగు గ్రామానికి వెళ్లడం ఇక్కడి విశిష్టత. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

యువకుని మృతికి ఎంపిటిసియే కారణమంటూ అతని నివాసం వద్ద బంధువుల ఆందోళన

ఎంపిటిసి ఇంటి వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - కలిదిండి

మృతుని (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొండంగిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోకా ఫణీంద్ర తన చెరువు వద్ద మృతి చెందడంతో మృతిని బంధువులు స్థానిక ఎంపిటిసియే కారణమంటూ ఎంపిటిసి నివాసం వద్ద మృతుని భౌతికకాయంతో ఆందోళనకు దిగారు. ఫణీంద్ర మృతికి ఎంపిటిసి కారణమని ఆరోపించారు. పరిస్థితి అదుపు చేసేందుకు కైకలూరు సిఐ ఆకుల రవి, కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్, కైకలూరు, ముదినేపల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరి ఆందోళన తీవ్రం కాకుండా అదుపు చేశారు. వివాహేతర సంబంధమే మృతికి కారణమని వారు ఆరోపించారు. ఎస్ఐ ప్రియ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గార్డు దాసుపై చర్య తీసుకోవాలి

ఫారెస్ట్ అధికారులకు జగన్నాథపురం పేదల విజ్ఞప్తి

నరికిన మామిడి మొక్కలను చూపిస్తున్న బాధితులు

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి మండలం సోమవరం గ్రామంలో ఫారెస్ట్ భూములపై కన్నేసిన భూస్వాములతో కుమ్మక్కైన చాట్రాయి ఫారెస్ట్ గార్డు దాసుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న కక్షతో నిరుపేదైన చిమట నాగమణి కష్టపడి ఆరు నెలలు పెంచిన మామిడి మొక్కలను తన అనచరులతో నరికించాడని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవరం గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 558లో ఎఫ్ఎంబి ప్రకారం 384.44 సెంట్లు భూమి ఉండగా మల్లవరపు అచ్యుత రామయ్యకు 300 ఎకరాలకు జెమిందార్ పట్టా ఉందని, మొత్తం భూమిని అనేక మంది రైతులకు ఏనాడో అమ్ముకొని పోయాడని, అదే నెంబర్‌లో మిగిలిన 74.44 సెంట్లు పోరంబోకుగా ఉందని, ఆ భూమిని 20 మంది పేదలం 40 సంవత్సరాలుగా సాగుచేసి మామిడి, జీడిమామిడి, తోటలు పెంచి జీవనం సాగుస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన బాబ్జి అనే భూస్వామి ఇక్కడ కొంతమంది రైతులను కలిసి, మేము సాగు చేస్తున్న పోరంబోకు భూమికి పట్టా వచ్చిందని, ఎకరానికి రూ.30 వేలు ఇస్తాను ఖాళీ చేయమని బెదిరించారని అన్నారు. అందుకు మాలో పది మంది వరకూ మా భూములు ఇవ్వమని ఎదురు తిరగడంతో చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి మమ్మల్ని బెదిరించారని, దాంతో మేము గత్యంతరం లేక గౌరవ హైకోర్టును ఆశ్రయించామని హైకోర్టు కేసు నంబర్ 3290 అఫీల్ చేయటం జరిగిందన్నారు. కోర్టు పెండింగ్‌లో ఉండగా ఫారెస్ట్ అధికారులు, చాట్రాయి రెవెన్యూ అధికారులు వచ్చి సర్వేరుతో కొలతలు తీయించి, ఇది ప్రభుత్వ భూమిగా తేల్చారన్నారు. ఇప్పటికి ఆరు నెలల క్రితం చచ్చిపోయిన మామిడి, జీడిమామిడి మొక్కలు స్థానంలో కొత్తగా మామిడి మొక్కలు వేస్తుంటే దాసు అనే గార్డు వచ్చి మేము వేసిన మొక్కలు పీకుతుంటే అడ్డుకున్నామని, దాంతో ఆయన డబ్బులు అడగటంతో అప్పటికప్పుడు రూ.10 వేలు ఇచ్చామని, అంతేకాకుండా మధ్యలో ఒకసారి నేను రూ.వెయ్యి ఇచ్చానని నాగమణి తెలిపింది. దాసు అనే గార్డు పేదలు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి ఇబ్బంది పెడుతూ అనేక మంది పేదల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నాడని, డబ్బులు ఇవ్వని వారి తోటల్లోకి తన అనుచరులను రాత్రివేళ పంపించి మొక్కలు నరికిస్తున్నాడని, ఒక్క జగన్నాథపురంలోనే కాదు సోమవరం గ్రామానికి చెందిన పేదల వద్ద డబ్బులు తీసుకోవడం జరిగిందని, ఇవ్వని వారి తోటల్లో మొక్కలు నరికిస్తున్నాడని ఇటువంటి లంచ గొండి ఫారెస్ట్ గార్డు దాసుపై ఉన్నతాధికారులు విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకోవాలని చిమట నాగమణి, పొన్న గంటి రంగారావు, చీకటి రామకృష్ణ డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT HANUMAKONDA

O.S. No. 3277 OF 2022

Between:
Ganta Nageshwar Rao ... Plaintiff

AND

Yadlapalli V.V. Siva Kumar & another ...Defendants

NOTICE

To
D1) Yadlapalli V.V. Siva Kumar, S/o. Sriramulu, Age: 43 years, Occ: Pvt. Employee, H.No. 9-148, Flat No. G-1, Balaji's Sai Maruthi Residence, Srinivas Nagar Colony, Nizampet, Hyderabad (or) C/o. P. Surya Chander Rao, S/o. Subba Rao, Age: 47 years, Occ: Business, R/o. H.No. 10-30-11/2, Near Jayalaxmi Theater, Bhagyalaxmipet, Tadepalligudem, West Godavari District, Andhra Pradesh State.

OOO

Whereas the above named plaintiff has instituted the above numbered suit against you and another for recovery of money. As you have avoiding the summons having the knowledge of suit proceedings the Hon'ble Court ordered summons through publication. Please take notice that the suit is posted on 07-02-2024 at 10:30 am for your appearance. So you are hereby summoned to appear in the above court on the above said date in person or through an advocate to answer the claim, otherwise the matter will be heard and decided in your absence.

(BY THE ORDER OF THE COURT)

Sd/-
Ennamsetti Venugopal Rao,
Advocate for the Petitioner
H.No. 4-7-131, Kumarpally,
Hanamkonda, Warangal Dist.

Date: 9-1-2024
Place: Hanumakonda